క్లుప్తంగా

జెడ్పీచైర్‌పర్సన్‌ను అవమానించడం సరికాదు

మహాముత్తారం: జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా జెడ్పీచైర్‌పర్సన్‌ను అవమానపర్చడం సరికాదని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని యామన్‌పల్లిలో వారు విలేకర్లతో మాట్లాడారు. దళిత మహిళ అయిన జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిని సమావేశానికి ఆహ్వానించి ప్రొటోకాల్ పాటించకుండా ఆగౌరపర్చడం బాధాకరమని అన్నారు. బీఆర్ఎస్ మండలపార్టీ మాజీ అధ్యక్షుడు రూపానాయక్, అధ్యక్షుడు కల్వచర్ల రాజు, మాజీ జెడ్పీటీసీ రాజిరెడ్డి ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మొగుళ్లపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రమ్ముల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

ఈటలను కలిసిన నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి ముదిరాజ్ యూత్ నాయకులు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను శుక్రవారం వరంగల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలు ఆయనకు వివరించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు మహేందర్, సురేష్, సుధీర్ తదితరులు తెలిపారు.

పరామర్శ

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన చెందిన కర్రె నర్సింహారెడ్డి, తనగర్ నరసింహులు, బామర్ గంగమ్మ, మండల కేంద్రానికి చెందిన గంగాదారి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ గొర్రె సాగర్ పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య, ఉపాధ్యక్షుడు తిరుపతి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్, ఉపసర్పంచ్ సంఘ గౌతమి అశోక్, మాజీ సర్పంచ్ మమత నాగరాజు ఉన్నారు.

గోపాలపూర్‌లో..

మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన పర్ల వరలక్ష్మి ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రుక్మొద్దీన్ ఉన్నారు.

మహిళకు తీవ్రగాయాలు

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలనైన సంఘటన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. తీవ్రగాయాలై రోడ్డు పక్కన ఉన్న మహిళను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మహిళ ఊరుగొండ గ్రామానికి చెందిన బొంత స్వప్నగా అని, కూరగాయలు అమ్ముతూ జీవనాన్ని కొనసాగిస్తుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు.

ఇద్దరి అరెస్ట్



కాటారం: మండల కేంద్రంతో పాటు గూడురు గ్రామాల్లో జరిగిన హత్యాచారం కేసుల్లో ఇద్దరు నిందితులను డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం గూడురులో మహిళపై హత్యాచారయత్నం చేసిన చీకట్ల మారుతి అలియాస్ ఆంజనేయులు, కాటారంలో హత్యాచారానికి పాల్పడిన కనుకుట్ల శ్రీనులను మండల కేంద్రంలో పట్టుకొని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ వెంట ఎస్సై-2 సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువ రైతు మృతి

మొగుళ్లపల్లి: పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న యువ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రంగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపూర్ గ్రామానికి చెందిన సరిగోమ్ముల ప్రశాంత్(26) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో వారికి ఉన్న నాలుగు ఎకరాల భూమిలో మిర్చి పంట వేయగా సరిగ్గా పండకపోవడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపానికి గురై గత నెల 31వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ వెల్లడించారు.

ఇప్పటికీ 'భగీరథుడు' రాలే!

- వెంచరామి గ్రామానికి బావి నీరే దిక్కు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

అధికారులు వచ్చుడు.. చూసుడు.. పోవుడు.. అంతే, మిషన్ భగీరథ నీళ్లు మాత్రం ఇయ్యరు. ఒకసారో.. రెండు సార్లో కాదు, రెండేళ్ల నుంచి ఇట్లనే చేస్తాళ్లు. నీళ్లేవి సార్లు అంటే.. రేపు, ఎల్లుండి అంటాళ్లు.. ఇప్పటికి ఈ మాట చెప్ప వట్టి రెండు సంక్రాంతి పండుగలు పోయిన్నై. నీళ్ల మాత్రం రాలే.. ఇంకిస్తారని నాకైతే నమ్మకంలేదు. మిషన్ భగీరథ నీరు అందకపోవడంపై మండలంలోని వెంచరామి గ్రామస్తుడి ఆవేదన ఇది. మిషన్ భగీరథ అధికారులు తమ గ్రామానికి గుర్తుకు వచ్చినప్పుడే వచ్చి.. వెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ వేసి కనీసం ఒక్కసారి కూడా నీళ్లు ఇవ్వలేదని వాపోతున్నారు.

\- చిట్యాల



రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైపు



నిరుపయోగంగా ఉన్న నల్లా

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రం నుంచి వెంచరామి అటవీ గ్రామం సుమారు 30 కిలోమీటర్లు ఉంటుంది. కనీసం ఈ గ్రామాన్ని అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకున్న పాపానలేదు. మండలంలోని వెంచరామి గ్రామంలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు ఇప్పటి వరకు రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామంలోని అమ్లేట్ పల్లే అయిన కుర్మపల్లికి మాత్రమే నీరు వస్తుంది. వెంచరామికి మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తుందని అధికారులను అడిగిన కనీసం పట్టించుకున్న పాపాన లేదని వారు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారే తమకు నీరు మాత్రం రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన పైపులైన్ పనులు ఇప్పటికి పూర్తి చేయలేదని పేర్కొంటున్నారు. రోడ్డు వెంటనే పైపు వేసి చేతులుదులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ చేసి నీరు ఇవ్వాలే కాని.. నీటి చుక్క రాకున్న ఇంటిలోపల ఉత్తగానే నల్ల పైపులు బిగించి పెట్టి వెళ్లిపోయారు. గ్రామ పంచాయతీ బావి నుంచి వస్తున్న నీటితోనే కాలం వెల్లదీస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బావి నీరే దిక్కు



మాకు మిషన్ భగీరథ నీరు చుక్క రావడం లేదు. ఎంత చెప్పిన ఏ అధికారి పట్టించుకోవడం లేదు. అధికారులు వచ్చి చూసి పోతున్నారు. కాని సమస్యను పరిష్కరిస్తాలేరు. ప్రస్తుతం బావి నీరే మాక్కు దిక్కుగా మారాయి.

\- మల్లారపు చంద్రయ్య, వెంచరామి, గ్రామస్తుడు

భగీరథ నీరు అందించాలి



మా ఇంటి వద్ద ఉత్తగానే మిషన్ భగీరథ నల్లా పైపు బిగించి పోయారు. ఇంటి ముందు ఉన్న రోడ్డు వద్దనే నల్లా పైపు వేశారు. ఇంటి లోపలకు పైపు వేయలేదు. ఇప్పటి వరకు కనీసం చుక్క నీరు రాలేదు. అధికారులు ఇప్పటికైన స్పందించి మాకు భగీరథ నీరు అందించాలి

\- ఎర్రబెల్లి రామారావు, వెంచరామి, గ్రామస్తుడు

నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఉపయోగంలో లేని మరుగుదొడ్లు, మూత్రశాలలు

మహదేవపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ఉన్న మరుగుదొడ్లు గత పది సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలల లోపల పిచ్చి మొక్కలు మొలచి కూలిపోయే దశకు చేరుకున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వరంగల్, భూపాలపల్లి తదితర ప్రాంతలకు ఈ బస్టాండ్ గుండానే రాకపోకలు సాగిస్తారు. వేలాది మంది భక్తులు కాళేశ్వరాలయానికి వెళ్తుంటారు. ఈ క్రమంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉపయోగంలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన నా ప్రజాప్రతిధులు, అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సదస్సులతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

మొగుళ్లపల్లి: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. శుక్రవారం మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రభుత్వం ధరణి కార్యక్రమం ద్వారా 95 శాతం భూ సమస్యలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఐదు శాతం అక్కడక్కడ ఇబ్బందులు ఉన్నాయన్నారు. రైతుల ఒకరి పట్టా మరొకరికి ఉండటం, అసలైన లబ్ధిదారులకు రైతుబంధు అందకపోవడం , సాదాబైనామనామాలు కూడా పెండింగ్ ఉన్నాయన్నారు. వాటిని ఎలా పరిష్కరించాలో ఏ సమస్యలు ఉన్నావో తెలుసుకోవాడానికే అంకుషాపూర్ గ్రామాన్ని మోడల్‌గా తీసుకొని అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ఏ ఇబ్బందులు ఉన్నా అర్జీ పెట్టుకుంటే సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రభుత్వం రెవెన్యూ అవగాహన సదస్సుకు మరో అవకాశం ఇచ్చిందని దీని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, తహసీల్దార్ సుమన్, సర్పంచ్ గాలి చంద్రమౌళి, ఆర్ఐ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సాగర్

చిట్యాల: మండలంలోని తిరుమాలాపూర్ గ్రామానికి చెందిన తోట నరేష్ ఇటీవల అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. దీంతో ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు రూ.18 వేల విలువ గల చెక్కు మంజూరు కాగా జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీఓ రామయ్య ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. మాజీ ఎంపీటీసీ పిట్ట సురేష్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, నాయకులు పెరుమాండ్ల రవీందర్ గౌడ్ ఉన్నారు.

ఎల్‌ఓసీ..



ఎల్‌ఓసీ అందజేస్తున్న మధు

మహాముత్తారం: మండలంలోని గండికామారానికి చెందిన నేరెళ్ల యుగేందర్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని కుటుంబసభ్యులు పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధును సంప్రదించగా వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల విలువ గల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈమేరకు ఎల్‌ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామం శివారులో ఏర్పాటు చేసుకున్న బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరై మాట్లాడారు. పాత వర్గం, కొత్త వర్గం అనే బేధం తనకు లేదని ఇద్దరు రెండు కళ్ల లాంటివారేన్నారు. మన మధ్య చిచ్చు రాజేషి పబ్బం గడపలనే ప్రతిపక్షాలకు మన చెంప పెట్టులా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి గౌరవిద్దామని, పార్టీ నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరిద్దామన్నారు. పార్టీ అధికారంలో ఉంటేనే కార్యకర్తలు, నాయకులకు మంచి రోజులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



రేగొండలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



మొగుళ్లపల్లిలో..

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలో పీఆర్‌టీయూ 2023 నూతన క్యాలెండర్‌ను మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దుస్స సుధాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి, నాయకులు కోరె భిక్షపతి, కామిడి సతీష్‌రెడ్డి, కుసుమ వెంకటేశ్వర్లు, సదయ్య, విజయ్‌కుమార్, ఐత మహేందర్, రమేశ్, జయంతి, శ్యాంసుందర్‌రెడ్డి, మోహన్, గీతారెడ్డి, శ్రీలత, నరేష్, నరేష్, రాముతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, ప్రధానకార్యదర్శి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో మండల కార్యావర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ ప్రభాకర్ చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సామల రమేష్, కృష్ణారెడ్డి, మొట్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామి, ఉపాధ్యాయులు సదానందం, రవీందర్, శ్రీనివాస్, కుమారస్వామి, ప్రణీత చంద్రయ్య, రాము, రాజమౌళి, అనిల్ కుమార్, రాజు, విజిత, రంగారావు, శ్రీనివాస్, వసంత, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాములు

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో షుగర్, బీపీ రోగుల కోసం ఎన్‌సీడీ కిట్లను సర్పంచ్ రాములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, ఏఎస్ఎం శ్రీలత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఇళ్లు లేని పేద, నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు హాజరై మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో కనీసం సొంతిళ్లు కూడా కట్టుకునే అదృష్టం లేకుండా పోయిందని వాపోయారు. ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు కేవలం రూ.3 లక్షలు మాత్రమే ఇస్తానని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఎనిమిదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, నిరుపేద ప్రజలను మోసం చేస్తూ వస్తున్నాయని మండిపడ్డారు. పేద ప్రజల పక్షాన ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించి పేదలకు ఇచ్చిందన్నారు. ఈ నిరసన దీక్షలో మడిపడిగె సురేష్‌కు చెందిన బహుజన కళా మండలి బృందం పాడిన పాటలు దీక్షలో పాల్గొన్న వారిని ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు చిలుకూరి కరుణ, నాయకులు మండ రవి, మోకిరాల మధువంశీ కృష్ణ, రాజు, లింగయ్య, చిట్యాల మండల అధ్యక్షులు తిరుపతి, రమేష్, రఫీ, ప్రసాద్ పాల్గొన్నారు.

ద్వితీయ మహాసభలకు తరలిరండి



కాళేశ్వరంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

చిట్యాల/కాళేశ్వరం/మహదేవపూర్/మొగుళ్లపల్లి: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ద్వితీయ మహాసభలకు జర్నలిస్టులు తరలిరావాలని టీయూడబ్ల్యూజే హెచ్ 143 జర్నలిస్టు నాయకులు అన్నారు. జిల్లాలోని చిట్యాల, కాళేశ్వరం, మహదేవపూర్, మొగుళ్లపల్లిలో వేర్వేరుగా శుక్రవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. చిట్యాలలో జిల్లా కార్యదర్శి వంశీ, జెడ్పీటీసీ గొర్రె సాగర్, సర్పంచ్ ఆకుల రవీందర్, మండల కో ఆప్షన్ సభ్యులు రాజ్ మహ్మద్, యూనియన్ జిల్లా నాయకులు సతీష్, సుధాకర్, ప్రవీణ్, స్థానిక పాత్రికేయులు బుర్ర చక్రపాణి, ఆకుల హరీష్, చింతల మహేందర్, గుర్రం శంకర్, చింతల రాజశేఖర్, వెల్లండి సత్యం, ధనుంజయ, జర్నలిస్టు జిల్లా నాయకులు వేల్పుల వెంకటేష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వలిహైదర్, ప్రధానకార్యదర్శి నాగుల సంతోష్, నాగరాజు, సంతోష్, దీన్‌మహ్మద్, ఎం, మహేష్, శ్రీకాంత్, కే.మహేష్ మహదేవపూర్‌లో మండల ఉపాధ్యక్షుడు నజీర్, సురేష్, కేదారి, ప్రవీణ్, జమిల్, శ్రీనివాస్, ముబిన్, మజీద్, రేగుల భాస్కర్, అన్వర్‌లు పాల్గొన్నారు. మొగుళ్లపల్లిలో ఎంపీపీ యార సుజాత, జెడ్పీటీసీ జోరుక సదయ్య, నాయకులు వంశీకృష్ణ, సతీష్, సుధాకర్, ప్రవీణ్, క్యాతరాజు రమేష్, నిమ్మల సారయ్య, దేవేందర్, రజినికాంత్, రమేష్ పాల్గొన్నారు.

ఢీకొన్న లారీలు



పాక్షికంగా ధ్వంసమైన లారీ

మల్హర్: మండలంలోని కొయ్యూరు నాగులమ్మ క్రాస్ వద్ద శుక్రవారం రెండు లారీలు ఢీకొన్నాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివారల ప్రకారం.. తాడిచర్ల ఓసీపీ నుంచి బొగ్గు లారీలు భూపాలపల్లి వైపు వెళ్తున్నాయి. ఈ క్రమంలో అతి వేగంతో వస్తున్న ఓ లారీ కొయ్యూరు నాగుల్మ సమీపంలో స్లో చేయడంతో వెనక నుంచి వస్తున్న మరో బొగ్గు లారీ ఢీకొట్టింది. దీంతో వెనుక ఉన్న లారీ ముందు భాగంగా పాక్షికంగా ధ్వంసం అయింది. కాగా, ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

కిష్టరావుపేటలో కార్డన్‌సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

మహదేవపూర్: మండలంలోని కిష్టరావుపేట గ్రామంలో శుక్రవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై రాజ్‌కుమార్ మాట్లాడారు. చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడే అసాంఘీక శక్తులకు ప్రజలు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో నూతనంగా ఎవరైనా వ్యక్తులు అనుమానితంగా కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీస్‌లు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

చిట్యాల: మండలంలోని పాసిగడ్డతండాకు చెందిన తిరుపతి గుడుంబా విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా వ్యక్తిని అనుమానించి తనిఖీ చేసినట్లు తెలిపారు. దీంతో అతని వద్ద 25 లీటర్ల గుడుంబా లభించిందని పేర్కొన్నారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది మధుసూదన్, సిద్దు, అశోక్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడిపై దాడి సరికాదు'

కాటారం: నిజామాబాద్ జిల్లా కోటగిరి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మల్లిఖార్జున్ అనే ఉపాధ్యాయుడిపై మతోన్మాదుల దాడి చేయడం సరికాదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ ఒక ప్రకటనలో ఖండించారు. గురువులు దైవంతో సమానం అని దేశంలో గురువుకు ఓ ప్రత్యేకత ఉందని అన్నారు. కొంత మంది మతోన్మాదులు ప్రభుత్వ పాఠశాలలో చొరబడి ఉపాధ్యాయుడిపై దౌర్జన్యం చేయడం శోచనీయం అన్నారు. ఉపాధ్యాయుడి ఇష్టానికి వ్యతిరేకంగా అతనిని ఊరేగింపుగా గుడిలోకి తీసుకెళ్లి బలవంతంగా బొట్టుపెట్టి ఆత్మగౌరవాన్ని కించపర్చారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగి అని చూడకుండా ఇలాంటి చర్యలకు పాల్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దుండగులను అరెస్ట్ చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామ పంచాయతీలోని రికార్డులను ఎంపీడీఓ నర్సింహమూర్తి శుక్రవారం పరిశీలించారు. ప్రతి రోజు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.